
# ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్



కోర్టు నుంచి వచ్చిన నోటీసు

## తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

- కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ


మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట


- మహాలక్ష్మి అలంకరణలో..


మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

- లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ


విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

- ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు


శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

## గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ– భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్





## డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

## సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## కొట్టంలో వ్యక్తి హత్య

- భార్య, అల్లుడు కలిసి చంపి ఉంటారని అనుమానం


శంకర్ (ఫైల్)

శక్కర్‌నగర్, అక్టోబర్ 6: బోధన్ పట్టణంలోని ఉద్మీర్‌గల్లీలో ఉన్న ఓ కొట్టంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఉద్మీర్‌గల్లీకి చెందిన కామొల్ల శంకర్ (40) ఈనెల 5న రాత్రి భోజనం చేసి రోజు మాదిరిగానే, పక్కనే ఉన్న గొర్రెల కొట్టంలో నిద్రించాడు. ఆదివారం ఉదయం వ్యక్తి లేవకపోవడంతో పలువురు అక్కడికి వెళ్లి పరిశీలించి, ఆయన మృతిచెందినట్లు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్సై హబీబ్‌ఖాన్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తిని కుటుంబీకులే హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానాలు వ్యక్తంచేశారు. పోలీసులు శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ వెంకట నారాయణను ఈ విషయమై వివరణ కోరగా, కామొల్ల శంకర్‌ది హత్యేనని.. పలువురు చేసిన అనుమానాల మేరకు మృతుడి భార్య, అల్లుడు రవిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నామని వెల్లడించారు. హత్యకు గురైన శంకర్ నిత్యం మద్యం తాగి భార్యతోపాటు అల్లుడు, కుటుంబీకులను దూషించడంతో పాటు గొడవపడేవాడని స్థానికులు పేర్కొన్నారు. గొడవలను తట్టుకోలేకే ఆయనను హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## కాలువలో యువకుడి గల్లంతు


అర్బర్ ఖాన్

వినాయక్‌నగర్, అక్టోబర్ 6 : నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్ వద్ద ఉన్న కాలువలో ఓ యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి హిల్స్ ప్రాంతానికి చెందిన అర్బర్ ఖాన్ (38) ఆదివారం డెయిరీఫారం వద్ద కాలువ గట్టుపై ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కాలనీవాసుల సమాచారం మేరకు ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

రామారెడ్డి, అక్టోబర్ 6: ఉరేసుకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని రెడ్డిపేట్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్పల్లి లక్ష్మి(58: అనారోగ్యంతో బాధపడుతున్నది. దీంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

భిక్కనూరు, అక్టోబర్ 6: మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కంఠేశ్వర్, అక్టోబర్ 6 : ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో జరిగే 12వ జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో సౌమ్య, సాత్విక, సన్నిత, శ్రావిక, సోని, వైశాలి, బాలుర విభాగంలో అరవింద్, లక్ష్వేందర్, కల్యాణ్‌రాజ్, అభినేశ్ ఎంపికైనట్లు తెలిపారు.

## ఘనంగా బోనాల ఊరేగింపు


సుద్దపల్లిలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మాలధారులు, గ్రామస్తులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 6 : మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ఆదివారం దుర్గామాత మండపం వద్ద భవానీ మాలధారుల ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. దుర్గామాత మండపం నుంచి బోనాలను పెద్దమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తులు, పోతరాజులు, ఒగ్గు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఆరేపల్లి చిన్నగంగారాం, వీడీసీ సభ్యులు పౌరాజ్, రమణాచారి, భూమయ్య, ఎల్లయ్య, దత్తు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ మకరంద్ పిలుపు
- ఘనంగా 'రన్ ఫర్ గ్రేస్.. స్క్రీనింగ్ ఫర్ లైఫ్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 6 : ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ కొంతసేపు వ్యాయామం చేయాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ పిలుపునిచ్చారు. ఇందూరు క్యాన్సర్ దవాఖాన, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రన్ ఫర్ గ్రేస్.. స్క్రీనింగ్ ఫర్ లైఫ్ కార్యక్రమాన్ని నగర శివారులోని బోర్గాం (పీ) గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ హాజరై మాట్లాడారు. మారుతున్న కాలాన్ని బట్టి ఆహారపు అలవాట్లు, దిన చర్యల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల్లో స్క్రీనింగ్ అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, క్యాన్సర్ దవాఖాన సెంట్రల్ హెడ్ ప్రదుమ్నారెడ్డి, మెడికల్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌సూరి, జనరల్ మేనేజర్ మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామంలో మద్యం విక్రయాలు నిలిపివేయాలని తీర్మానం


తీర్మాన ప్రతిని చూపుతున్న ఆజామాబాద్ గ్రామస్తులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 6: మండలంలోని ఆజామాబాద్ గ్రామంలో లిక్కర్ (మద్యం) అమ్మకాలు చేయొద్దని గ్రామస్తులు ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలోని బెల్ట్‌షాపుల్లో, మరెక్కడా లిక్కర్ అమ్మకాలు చేయొద్దన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు చేపడుతుండడంతో యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నదని తెలిపారు. ఆజామాబాద్‌ను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామపెద్దల అభిప్రాయంతో తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి అందజేశారు. తీర్మానాన్ని ఎవరైనా ఉల్లంఘించి గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.50వేల జరిమానా విధిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పట్లోళ్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 18వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


నాలుగు గేట్ల ద్వారా కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల


కందకుర్తి గోదావరినదిలో కొనసాగుతున్న నీటి ప్రవాహం

నిజాంసాగర్, అక్టోబర్ 6: ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద పెరగడంతో ఆదివారం సాయంత్రం నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 18,700క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో వరద గేట్ల ద్వారా 17వేలు, ప్రధాన కాలువ ద్వారా 1700 క్యూసెక్కుల చొప్పున మొత్తం 18,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 1405.11 అడుగుల (17.802టీఎంసీల)కు ప్రస్తుతం 1404.83 అడుగుల (17.556టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

### ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, అక్టోబర్ 6: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 21,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రాజెక్ట్‌లో 1091 అడుగుల (80.501టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, వరద కాలువకు 12వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

### గోదావరినదిలో నిలకడగా నీటి మట్టం

రెంజల్, అక్టోబర్ 6: మండలంలోని కందకుర్తి వద్ద గోదావరినదిలో నీటి మట్టం నిలకడగా ఉన్నది. వర్షాలు శాంతించినా నీటి ప్రవాహం కొనసాగుతున్నది. నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగిపోగా, భక్తులకు శిఖరం దర్శనమిస్తున్నది.

## కాంగ్రెస్ పార్టీకి దళితులంటే చిన్నచూపు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, అక్టోబర్ 6 : కాంగ్రెస్ పార్టీకి దళితులంటే ముందు నుంచీ చిన్నచూపు అని, ఆనాడు అంబేద్కర్‌ను ఓడగొట్టింది కాంగ్రెస్ పార్టీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో దళిత మేధావుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీలో అంబేద్కర్ పేరుపై రెండు ఎకరాల్లో రూ.100 కోట్లతో స్మారక భవనాన్ని నిర్మించడం సంతోషకరమనారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, ఎస్సీ మోర్చా నాయకులు సందీప్, సాయినాథ్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


## రెండు గ్యాంగుల మధ్య ఘర్షణ

- పీడీఎస్ బియ్యం దందానే కారణం..

వినాయక్‌నగర్, అక్టోబర్ 6 : జిల్లాకేంద్రంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం దందా చేస్తున్న రెండు గ్యాంగుల మధ్య వారి చిన్నపాటి ఘర్షణ పరస్పరం దాడులకు దారితీసింది. చాలా కాలంగా రేషన్ బియ్యం దందా చేసే రెండు గ్రూపుల మధ్య విభేదాలు రావడంతో శనివారం ఆ గ్యాంగుల మధ్య ఘర్షణ జరిగింది. నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రాండ్ ప్లాజా హోటల్‌లో ఓ గ్యాంగుకు చెందిన మజార్, హంజల, నోమాన్ ముగ్గురు కూర్చొని ఉన్న సమయంలో ప్రత్యర్థి గ్యాంగుకు చెందిన అఫ్సర్, సిద్ధిఖీతో పాటు మరికొంత మంది దాడి చేశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాడిచేసిన గ్యాంగ్‌పై క్షతగాత్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## కుల బహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారు

- విచారణ జరిపి న్యాయం చేయాలి
- ఎక్సైజ్ కార్యాలయంలో గౌడ కులస్తుల ఫిర్యాదు


ఫిర్యాదును అందజేస్తున్న మోస్రా గౌడ కులస్తులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 6: జీవనోపాధిలో భాగంగా ఇతర గ్రామాల్లో ఉంటున్న తమను కుల బహిష్కరణ చేస్తామంటూ కొందరూ బెదిరిస్తున్నారంటూ కొందరు గౌడ కులస్తులు ఆదివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి గౌడ కులస్తులం అందరం కలిసిమెలసి ఉండేవారమని, ఆర్థిక పరిస్థితుల కారణంగా తాము ఇతర ప్రాంతాల్లో ఉంటున్నామని తెలిపారు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి కులస్తుల కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొందరు తమను కుల బహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీసు అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని వారు స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మల్లికార్జున్ గౌడ్, శేఖర్ గౌడ్, బాలరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.